క్లుప్తంగా

బోరు ఏర్పాటు

కోసిగి: మండలంలోని ఐరన్‌గల్లు గ్రామంలో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సొంత నిధులతో సోమవారం సర్పంచ్ రామాంజనేయులు బోరు వేయించారు. సర్పంచ్ మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగు నీటి సమస్య రాకుండా ముందస్తుగా బోరు వేయించినట్లు తెలిపారు. 3.5 ఇంచులు నీళ్లు పడటంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు భీమసేన, వెంకటేష్, సంజీవరెడ్డి, చిన్న ఈరేష్, ఉప సర్పంచ్ గోపాల్, ఈరన్న, జె.కె.అళ్లప్ప, రంగయ్య, నారాయణ ఉన్నారు.

నాటుసారా స్వాధీనం

పెద్దకడబూరు: మండలంలోని కల్లుకుంట గ్రామ కొండల్లో సోమవారం నాటుసారా స్థావరంపై ఎస్‌ఐ మహేష్‌కుమార్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఇందులో 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడంతో పాటు 25 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ మాట్లాడుతూ తమను చూసి బట్టీ నిర్వాహకుడు పారిపోయాడని, త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని చెప్పారు. అలాగే..గంగులపాడు గ్రామ పొలిమేరలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి రూ. 20,500 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.నగదుతో పాటు 4 సెల్‌ఫోన్‌లు, 3 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామన్నారు. మరికొందరు పారిపోయారని వారిని కూడా గుర్తించి కేసు నమోదు చేస్తామని వివరించారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులతో ప్రదీప్ రెడ్డి

మంత్రాలయం: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై. ప్రదీప్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఖగ్గల్ గ్రామంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడకారులు క్రీడ స్ఫూర్తితో ఆడాలని సూచించారు. గెలుపొందిన జట్టుకు రాంపురం రెడ్డి సోదరుల సహకారంలో మొదటి బహుమతి రూ.25వేలు, రెండవ బహుమతి భీమా యూత్ సహకారంతో రూ.15వేల నగదు అందజేయనున్నట్లు తెలిపారు. సర్పంచ్ రాఘవరెడ్డి, చంద్ర, హనుమంతు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఆదోనిరూరల్: క్రీడల్లో రాణిస్తున్న మండలంలోని పెద్దహరివాణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం ఇందిరాదేవి, పీఈటీ రామన్న అభినందించారు. సోమవారం వారు మాట్లాడుతూ చిత్తూరు జిల్లా చౌడేపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో బి.మనుమేష్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి, ప్రతిభ చూపి బంగారు పతకం సాధించాడన్నారు. చెస్ పోటీల్లో ఎస్. ప్రహర్ష రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి మూడో స్థానంలో నిలిచాడన్నారు. ఖోఖో పోటీల్లో గణేష్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి జూనియర్ పోటీల్లో చిత్తూరు జిల్లాలో కర్నూలు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించగా.. జిల్లా జట్టు మూడోస్థానంలో నిలిచిందని చెప్పారు. నరసారావుపేటలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో గర్జమ్మ ప్రతిభ కనబరిచిందన్నారు.

ఆత్మీయ వీడ్కోలు



గోవింద్‌సింగ్‌ను సన్మానిస్తున్న సబ్‌కలెక్టర్

ఆదోనిరూరల్: బదిలీపై అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా వెళ్తున్న సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి గోవింద్‌సింగ్‌కు సోమవారం సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ, కార్యాలయ సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. సబ్‌కలెక్టర్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీలు సహజమన్నారు. పరిపాలనాధికారిగా గోవింద్‌సింగ్ అందించిన సేవలను కొనియాడారు. భవిష్యత్‌లో మరిన్ని పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం సబ్‌కలెక్టర్, రెవెన్యూ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి శాలువాలతో గోవింద్‌సింగ్‌ను సన్మానించారు.

మహాకుంభాభిషేకం నిర్వహించాలి

ఆదోనిఅర్బన్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి కోవెలలో జరగాల్సిన మహాకుంభాభిషేకాన్ని వెంటనే నిర్వహించాలని కర్నూలు జిల్లా జంగమ సంఘం నాయకులు మంజునాథ్, మల్లికార్జున, శివరాజ్, బద్రినాథ్‌స్వామి కోరా రు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. రెండుసార్లు వాయిదాపడిన కుంభాభిషేకాన్ని ప్రభుత్వం జరిపించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యలో విప్లవాత్మక మార్పులు

- నాడు–నేడుతో బడులకు కొత్త రూపు
- ఆధునిక పద్ధతుల్లో బోధన
- 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల అందజేత
- పకడ్బందీగా జగనన్న గోరుముద్ద అమలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత విద్యావ్యవస్థను సంస్కరించారు. సమూల మార్పులు చేపట్టి నూతనంగా జవసత్వాలు సమకూర్చారు. అధ్వానంగా ఉన్న బడులను నాడు–నేడుతో ఔరా అనేలా రూపుదిద్దారు. మధ్యాహ్న భోజనం నాణ్యవంతంగా అందజేస్తున్నారు. విద్యాకానుక పేరుతో విద్యార్థులకు అవసరమైన వాటన్నింటినీ ఉచితంగా అందజేస్తున్నారు. ఇక పేద తల్లులు పిల్లలను చదివించేలా ప్రోత్సహించేందుకు అమ్మ ఒడి పేరుతో ఏటా రూ.15వేలు వారి ఖాతాల్లో వేస్తున్నారు. ఇక ఆధునిక విధానాల్లో బోధించేందుకు ఐఎఫ్‌పీను అందజేశారు. అలాగే..8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసి సాంకేతిక విద్య అందుబాటులోకి తెచ్చి కార్పొరేట్‌కు దీటుగా మార్చారు.





కోసిగి బాలికల ఉన్నతపాఠశాలలో ఐఎఫ్‌పీ ద్వారా విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయిని, 8వతరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న దృశ్యం

కోసిగి: ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ బడులను తలదన్నేలా రూపుదిద్దింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. అన్ని రకాల వసతులు, ఆధునిక బోధన పద్ధతులు తదితర వాటితో ఆ విద్యార్థులకు దీటుగా సర్కారు బడుల్లోని విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. నిరుపేదల పిల్లలకు కూడా ఇంగ్లిష్ మీడియం చదువు అందుబాటులో ఉంచాలని సర్కారు బడుల్లో ఇంగ్లిష్ మీడియం అమలు చేస్తున్నారు. మండలంలో 1-10వ తరగతి వరకు 13 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 2 ప్రాథమికోన్నత, 33 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 14,780 మంది విద్యార్థులు చదువుతున్నారు. అన్ని తరగతుల స్థాయిలోని పాఠ్య పుస్తకాలను పీడీఎఫ్ రూపంలో ఆన్‌లైన్ ఉంచడంతో పాటు బైజూస్ కంటెంట్ తో 8వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు అందజేసింది. 6- 10వ తరగతి విద్యార్థులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు (ఐఎఫ్‌పీ) ద్వారా డిజిటల్ విద్య, ప్రాథమిక స్థాయి విద్యార్థులకు స్మార్ట్ టీవీలతో విద్యాబోధన అందిస్తున్నారు. ఇందుకు గానూ మండలంలోని పాఠశాలలకు 86 ఐఎఫ్‌పీ ప్యానెల్, 50 స్మార్ట్ టీవీలు అందజేశారు. తెలుగు మీడియం పిల్లలకు అర్థమయ్యే రీతిలో తెలుగు అండ్ ఇంగ్లిష్ మీడియంలో పాఠ్యపుస్తకాలను ముద్రించి అందజేశారు. ప్రతి తరగతికి సబ్జెక్ట్ ఉపాధ్యాయులు డిజిటల్ బోధన చేస్తుండటంతో విద్యార్థులు సులభంగా అర్థం చేసుకుంటున్నారు.

నాడు–నేడుతో పాఠశాలల మార్పు..

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలను నాడు–నేడు కింద రూపు రేఖలు మార్చేసింది. రెండు విడుతలుగా పాఠశాలలు ఎంపిక చేసి విద్యార్థులకు అవసరమయ్యే వసతులను కల్పించింది. మొదటి విడతలో 23 పాఠశాలలను రూ.22 కోట్లుతో రూపుదిద్దారు. రెండవ విడతలో 40 పాఠశాలల్లో రూ.26 కోట్లతో పనులు చేస్తున్నారు.

విద్యాకానుక..

పేద విద్యార్థుల తల్లిదండ్రులకు పిల్లల చదువు భారం కాకూడదని ప్రభుత్వం విద్యాకానుక పేరుతో పుస్తకాలు, యూనిఫాం, బెల్టు, బ్యాగ్, బూట్లు, నోట్ పుస్తకాలు అందిస్తోంది. మండలంలో అమ్మ ఒడి కింద 7,320 మంది లబ్ధి పొందారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా పాఠశాలల్లో నాణ్యమైన భోజనం వడ్డిస్తున్నారు. మెను ప్రకారం అన్నం, ఆకు కూరగాయలు, ఉడికించిన గుడ్డు, చిక్కి, రాగి జావా అందిస్తోంది. మండలంలో ప్రతి రోజు 9,220 మంది విద్యార్థులు బడిలో భోజనం చేస్తున్నారు.



'జగనన్న గోరుముద్ద'ను అందిస్తున్న దృశ్యం



నాడు–నేడు కింద రూపుదిద్దిన హెచ్‌జీ ప్రాథమిక పాఠశాల

పాఠశాలను బాగా మార్చారు



జగనన్న ప్రభుత్వం వచ్చాక పాఠశాలలను బాగా మార్చారు. మా కుమార్తె కోసిగమ్మకు మూడేళ్ల నుంచి అమ్మ ఒడి వస్తుంది. విద్యార్థులకు అవసరమయ్యే బుక్స్, యూనిఫాం అన్నింటినీ విద్యాకానుక కింద అందజేయడంతో మాలాంటి పేదలకు భారం తగ్గింది. ఆడ పిల్లలకు చదువు ఎందుకు అనుకునే వాళ్లం. అలాంటిది మేం పిల్లలను ధైర్యంగా బడికి పంపేలా చేశారు. పైసా ఖర్చు లేకుండా ఉచితంగా చదివిస్తున్నారు. చాలా సంతోషకంగా ఉంది.

– తిక్కస్వామి, కోసిగి


ఆడపిల్లలను ధైర్యంగా చదివిస్తున్నాం



పిల్లలను చదివించడం కష్టంగా మారిన సమయంలో జగనన్న ప్రభుత్వం విద్యార్థులకు అన్నీ ఉచితంగా అందజేసి మాలాంటి పేదల తల్లిదండ్రలకు ఆర్థిక భారాన్ని తగ్గించింది. మా కుమార్తె పల్లవి 8వ తరగతి చదువుతుంది. ప్రస్తుతం ట్యాబ్‌లు ఇచ్చారు. బడులను అందంగా మార్చారు. అన్ని వసతులున్నాయి. ప్రభుత్వం చాలా మంచి పనిచేసింది.

– మునిస్వామి, చింతకుంట

1,340 మందికి ట్యాబ్‌లు అందజేశాం



రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చేపట్టింది. నాడు–నేడు కింద పాఠశాలల్లో పనులు ముమ్మరంగా చేయించాం. పాఠశాలల్లో విద్యాకానుకను సక్రమంగా పంపిణీ చేశాం. డిజిటల్ విద్యను సక్రమంగా అమలయ్యేలా చర్యలు చేపట్టాం. ఇటీవల మండలంలోని 1340 మంది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశాం. నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాం.

– నాగేశప్ప, ఎంఈఓ

ఆలయానికి ఎమ్మెల్యే రూ.51 వేలు విరాళం



కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిఅర్బన్: పట్టణంలోని రిక్రియేషన్ ఆవరణలో వెలిసిన శ్రీ అశ్వర్థలక్ష్మీనారాయణ ఆలయానికి దూప, దీప నైవేద్యాల కోసం ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి రూ.51 వేలు విరాళంగా ఇచ్చారు. సోమవారం ఎమ్మెల్యే స్వగృహంలో ఆలయ కమిటీ సభ్యులకు నగదును అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతో పురాతనమైన ఆలయమని, ఇలాంటి ఆలయాల అభివృద్ధికి భక్తులు శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సత్యనారాయణ, జయరామ్, శ్రీధర్, నాగరాజుగౌడ్, చెన్నబసప్ప తదితరులు పాల్గొన్నారు. శ్రీ అశ్వర్థలక్ష్మీనారాయణ ఆలయంలో మహాగణపతి, సతీసమేత ఆదిత్యాది నవగ్రహ, నాగదేవతలు, శిఖర కలశ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలు ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు ఉంటాయని కమిటీ సభ్యులు సత్యనారాయణ, నాగరాజుగౌడ్, శ్రీధర్, చెన్నబసప్ప తెలిపారు. ఇందులో భాగంగా గోవు, గంగ, గణపతి పూజలు, అభిషేకాలు, హోమాలు, విగ్రహ ప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. చివరిరోజున అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్లు



సబ్‌కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న ఆదోని తహసీల్దార్ హసీనాసుల్తానా




సబ్‌కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తహసీల్దార్ పి. మురళి



కౌతాళం ఎంపీడీఓగా రఘునాథ్ గుప్తా

ఆదోనిరూరల్: ఆదోని డివిజన్ పరిధిలోని 9 మండలాల తహసీల్దార్ల బదిలీ జరిగిన విషయం విదితమే. వారి స్థానాల్లో కొత్తగా ఎనిమిది మంది తహసీల్దార్లు అనంతపురం జిల్లా నుంచి వచ్చి బాధ్యతలు చేపట్టారు. సోమవారం వారు స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మను కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపి తమ పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఇందులో ఆదోని మండల నూతన తహసీల్దార్‌గా హసీనాసుల్తానా, ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారిగా పి.ఆర్.శేషయ్య, హొళగుంద తహసీల్దార్‌గా ఎ.ఎం.ప్రసాద్‌రాజు, నందవరం ఎ.ఓబులేష్, కౌతాళం అలెగ్జాండర్, గొనెగొండ్ల పి.పార్వతి, ఎమ్మిగనూరు టి.శేషిరెడ్డి, మంత్రాలయం తహసీల్దార్‌గా శ్రీధర్‌మూర్తిలు బాధ్యతలు చేపట్టారు. ముందుగా వారు ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మను కలిసి శుభాకాంక్షలు తెలియజేసి విధుల్లో చేరారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతి తహసీల్దార్ పగడ్బందీగా, నిష్పక్షపాతంగా పని చేయాలని సూచించారు.



తహసీల్దార్‌గా అలెగ్జాండర్

కౌతాళం తహసీల్దార్‌గా అలెగ్జాండర్

కౌతాళం: తహసీల్దారుగా అలెగ్జాండర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మండల కేంద్రంలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రస్తుతం జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్, ఎన్నికల విధుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండి ఎప్పటి పనులను అప్పుడే పూర్తి చేయాలని చెప్పారు.

కౌతాళం: ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జగనన్న ఇళ్ల, మరుగుదొడ్ల నిర్మాణాలు, చెత్త సేకరణ కేంద్రాలపై సిబ్బందితో సమీక్షించారు.

కోసిగి తహసీల్దార్‌గా పి. మురళి

కోసిగి: తహసీల్దార్‌గా పి.మురళి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణ శర్మను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కోసిగి తహసీల్దార్ కార్యాలయం చేరుకుని విధుల్లో చేరారు. ఆయన చిత్తూరు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ఈరన్నస్వామి ఆలయానికి 3.2 కేజీల వెండి విరాళం



దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం



స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన మండల పరిధిలోని ఉరుకంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి ఆలయానికి భక్తులు 3కేజీల 240 గ్రాముల వెండిని సోమవారం విరాళంగా అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. ఆదోని వాస్తవ్యులు కృష్ణ వారి కుటుంబ సభ్యులు దేవాలయ కార్యాలయంలో వెండి గట్లును అందజేయగా.. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, పూలమాల, శేష వస్త్రాలు, లడ్డూ, బాండు, ఫొటోను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు మల్లికార్జున, సీనియర్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్లు వీరేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈరన్నస్వామికి అభిషేక పూజలు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రంలో భక్తుల సందడి నెలకొంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫల పుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. భక్తులు పిండివంటలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

హాస్టల్‌లో సమస్యలను పరిష్కరిస్తాం

పెద్దకడబూరు : స్థానిక బీసీ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు తెలిపారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం బీసీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. అక్కడ నెలకొన్న సమస్యలు, అందిస్తున్న ఆహారంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉదయం చేసిన అల్పాహారాన్ని విద్యార్థులతో కలిసి ఆరగించారు. అనంతరం వార్డెన్ విధుల్లో లేకపోవడంతో ఫోన్‌చేసి సమయపాలన పాటించాలని కోరారు. అనంతరం వారు వార్డెన్‌పై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఎంఈఓలు సువర్ణల సునియం, రామమూర్తిని ఫోన్‌లో కోరారు. మంచినీటి ఇబ్బంది ఉందని విద్యార్థులు వారి దృష్టికి తీసుకురాగా ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కోసిగి మార్కెట్‌యార్డ్ మాజీ వైస్ చైర్మన్ ముక్కరన్న ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఆదోనిటౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారమే స్పందన కార్యక్రమం లక్ష్యమని ఇన్‌చార్జ్ ఎంఈ నాగభూషణరెడ్డి తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ వార్డులకు చెందిన ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని సమస్యల పరిష్కారం కోసం అర్జీలు సమర్పించారు. టౌన్‌ప్లానింగ్, వాటర్ వర్క్స్, రెవెన్యూ సెక్షన్ల పరిధిలో సమస్యలపై ఐదుగురు దరఖాస్తు చేసుకున్నారు. సంబంధిత అధికారులకు విచారించి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

స్పందన అర్జీలను గడువులోపు పరిష్కరించాలి



ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోనిరూరల్: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి, అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణ శర్మ సూచించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ వారంలోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్‌ఎల్‌ఏ లోకి వెళ్లకుండా చూడాలని ఆదేశించారు.

స్పందనలో వచ్చిన సమస్యల్లో కొన్ని....

- ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన హనుమంతుకి సంబంధించి సర్వేనంబర్ 9ఏలో 2.22 ఎకరాల భూమి, సర్వేనంబర్ 85ఏలో 1.37 ఎకరాల భూమి పెద్దల నుంచి సంక్రమించిందని, సదరు భూమిని కొందరు ఆక్రమించి దౌర్జన్యం చేస్తున్నారని, వెంటనే విచారణ చేసి న్యాయం చేయాలని అర్జీ సమర్పించాడు.
- కల్లుబావి పంచాయతీకి చెందిన సురేష్‌కు సంబంధించిసర్వేనంబర్ 262ఎఫ్‌లో 1.46 ఎకరాల భూమి ఉందని, సదరు భూమి ఆన్‌లైన్లో 0.95 మాత్రమే ఉందని, మిగిలిన భూమి వేరే వారిపై నమోదయ్యిందని, దయచేసి విచారణ చేసి ఆన్‌లైన్‌లో తన పేరు నమోదు చేయాలని అర్జీ సమర్పించాడు.
- ఆదోని మండలం బైచిగేరి గ్రామానికి చెందిన శేఖమ్మకు సంబంధించి సర్వేనంబర్ 167సీలో 1.22 ఎకరాల భూమి ఉందని, సదరు భూమిలో 8 సంవత్సరాల క్రితం ఎకరా అమ్మడం జరిగిందని, మిగిలిన 22 సెంట్ల భూమికి ఆన్‌లైన్‌లో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని దరఖాస్తు సమర్పించారు.
- 40 సంవత్సరాలుగా ఆదోని పట్టణం కల్లుబావిలో నివాసం ఉంటున్నాం. మాకు పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని ఆదోని పట్టణం కల్లుబావికి చెందిన బాలరాజు అర్జీ సమర్పించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ శ్రీనివాసులు, గృహనిర్మాణశాఖ డిప్యూటీ ఇంజినీర్ రవికుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి, ఆర్టీఓ నాగేంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ, ఉప తహసీల్దార్ కౌసర్‌బాను తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలి

ఆదోనిరూరల్: కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ కోరారు. సోమవారం స్పందన కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ శివనారాయనశర్మకు విద్యా సంస్థల అవినీతికి సంబంధించిన ఆధారాలతో వినతి పత్రాన్ని సమర్పించారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు 2023–24 విద్యా సంవత్సరం పూర్తికాకముందే రంగురంగుల కరపత్రాలతో విద్యార్థి తల్లిదండ్రులను మోసపూరిత మాటలు చెప్పి, 2024–25 విద్యా సంవత్సరానికి ముందస్తుగా అడ్మిషన్లు జరుపుతున్నారన్నారు. విద్యార్థులతో ట్యూషన్ ఫీజుల పేరిట రూ.30 వేల నుంచి రూ.50 వేలు వరకు వసూలు చేస్తున్నారని చెప్పారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ హామీ ఇచ్చారు. మల్లికార్జున, నరేష్, వీరేష్, ప్రేమ్, సునీల్, రవి పాల్గొన్నారు.

సర్వహక్కుల కోసమే స్థలాల రిజిస్ట్రేషన్లు

కౌతాళం: నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడంలో భాగంగా ప్రభుత్వం అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ప్రత్యేక కాలనీలను ఏర్పాటు చేసింది. అయితే భవిష్యత్‌లో వారికి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ముందుగానే ఆ స్థలాలను వారిపేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని నిర్ణయించింది. ఈమేరకు రిజిస్ట్రేషన్ ఇవ్వడం ప్రారంభించింది. రిజిస్ట్రేషన్ చేసి ఇస్తే ఆ స్థలం, ఇంటిపై వారికి సర్వహక్కులు లభిస్తాయి. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ కోసం లబ్ధిదారులు క్యూ కడుతున్నారు. సోమవారం లబ్ధిదారులు ఆయా సచివాలయాలకు అధికంగా తరలివచ్చారు. మండలంలో 3,234 మంది జగనన్న కాలనీల్లో ఇళ్ల పట్టాలు పొందారు. వీరందికి రిజిస్ట్రేషన్లు చేస్తామని తహసీల్దారు అలెగ్జాండర్ తెలిపారు. మండల కేంద్రంలో 620 మందికి పట్టాలు ఇచ్చినట్లు చెప్పారు. ఎరిగేరి గ్రామంలో 326 మందికి, చూడి గ్రామంలో 219 మందికి ఇంటి పట్టాలు ఇచ్చారు. మండలంలోని 30 పంచాయతీల్లో ఇంటి పట్టాలను పంపిణీ చేసింది. వీరందరికి రిజిస్ట్రేషన్లు చేస్తామని ఇప్పటికే ఈ ప్రక్రియ వేగవంతంగా చేపట్టినట్లు తెలిపారు. మరో నాల్గు రోజుల్లో ప్రక్రియ పూర్తయ్యేలా చూస్తామన్నారు. సోమవారం తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి ఆయా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పర్యవేక్షించి వీఆర్‌ఓ, కార్యదర్శులకు సూచనలు చేశారు.

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

పెద్దకడబూరు : విద్యారంగంలో మార్పులు తీసుకొస్తానన్న కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్నే కాషాయకరణ చేయడానికి కుట్ర పన్నుతుందని తక్షణమే నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి షాబీర్‌బాషా డిమాండ్ చేశాడు. స్థానిక ఆదర్శ పాఠశాలలో సోమవారం ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థామస్ అధ్యక్షతన మండల సమితి సమావేశం ఏర్పాటు చేశారు. మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా అరుణ్, ఉపాధ్యక్షులు రాజు, హనుమంతు, గౌస్, సుభాన్, ప్రధానకార్యదర్శి షేక్షావలి, సహాయ కార్యదర్శులు ఆనంద్, మల్లి, విరుపాక్షి, ప్రశాంత్, కోశాధికారిగా మహమ్మద్, మహిళా కన్వీనర్ మల్లేశ్వరి, కో కన్వీనర్లు శ్వేత, తిరుమలమ్మ, తాయమ్మ, భవాని, అంజలి, సునీత, నందినితో పాటు మరో 11మంది కార్యవర్గ సభ్యులు, 21మందిని కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

కోసిగి: కరువు సహాయక చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య కోరారు. సోమవారం సీపీఐ జిల్లా సమితి పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ మండల కార్యదర్శి గోపాల్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రుద్రగౌడకు వినతి పత్రం అందజేశారు. గిడ్డయ్య మాట్లాడుతూ గతేడాది వర్షాలు సకాలంలో కురువక అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారన్నారు. కావున జిల్లాలో 24 మండలాలలను కరువు మండలాలుగా ప్రకటించాలరని కోరారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, మంత్రాలయం మండల కార్యదర్శి లక్ష్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.